


# ★ నల్లపిల్ల ★

రచన : యం. అంజనేయులు

సూర్యభగవానుడు తన కిరణాలతో లోకాన్ని మండిస్తున్నాడు. కుర్చీలో జారగిలబడి బజారువేపు చూస్తూ కూర్చున్నాను. అప్పుడప్పుడూ ఒకరు యిద్దరు బజారువెంట పరుగుతీస్తున్నట్లు నడుస్తున్నారు. మూడు గంటలయింది. ఇంకా గంటకుగాని కిట్టిగాడురాడు. దరిద్రుడు ఏ అడపిల్లలతో హస్కుకొడుతూనో కూర్చుంటాడు. తలుపులువేసి 'టీ కప్పులో తుఫాను' పుస్తకం తీసికొని మంచంమీదకు తనువుచేరవేసి కిటికీతలుపులు తీశాను. ప్రక్కవాటాలోని ప్లీడర్‌గారమ్మాయి కిటికీలోగుండా బజారువేపు చూస్తూవుంది. చిత్రకారుణ్ణి కానందకు నన్ను నేనే తిట్టుకున్నాను. ఆహా! ఏమి అ సుందరదృశ్యం వెలుపల అర్కునిఅట్టహాసపుకిరణజ్యోతులు. సౌధంలో అలలనామణి వదనారవిందపు జ్యోతిమండలం, ఆమెకన్నులు విస్ఫారితములు. అమె ఎర్రని కపోలాలు, అరవిచ్చిన గులాబీలా ఆమె పెదవులు నన్ను ఏవో ఊహాలోకాల్లో విహరింపచేశాయి. కిట్టిగాడు అంటాడూ "నాకు తెలుసులేవోయ్. రామిగాడులేనప్పుడు ఈ దెయ్యాలకొంపలో నువ్వెందు కుంటున్నావో! ఆ ప్లీడర్ కూతురు కాంతంకోసమే కదూ? వాడనేదాంట్లో కొంత నిజంలేకపోలేదు. ఐనా వాడి దుంపతెగా ఎక్కడ ఎప్పుడు ఎట్లా మాట్లాడాలో తెలీదు. పుటిక్కిన పదిమందిలో గుండె దూసుకపోయే మాట అంటాడు. ఆమెను ఇదివరకు చాలాసార్లు చూచాకాని ఎందుకో ఇంత అందంగా ఎప్పుడూ కన్పడలేదు. ఒక్కసారి అమె అనురాగపూరితదృక్కులు నా కళ్ళల్లో దేనినో వెతికినట్లయింది. అబ్బ! అమెచూపుకోసం మాటకోసం స్పర్శకోసం ఏమి చెయ్యగూడదు. హఠాత్తుగా నా గుండెలో ఏదో కలుక్కుమంది. నా గొంతులో ఏదో గరగరమంది.

"వలరాజు చెలరేగి
దరిచేరి గురిచూసి"
.........................
.........................

అన్న నా యువకవి మిత్రునిపాట నోట వెలువడింది. నన్ను చురచురా చూసి, కిటికీరెక్కలు టపటపమనిపించి, గాజుల గలగలతో సుందరహస్తాన్నొకసారి చిలుకకొయ్యపై యుంచి చిలుకకొయ్యతో కిటికీ రెక్కలను బంధించింది.

"చూచింది ఓ చూపు
చురచురా నన్ను"

అనే నా మిత్రుని గేయం నా గొంతులో ఖంగుమంది. ఆపాట ఆ సుందరివీనులకు కఠోరంగా వుంది కాబోలు.

కిట్టిగాడు ఏమనుకున్నా మిత్రులందరూ పరిహసించినా ఏ సుందరి కటాక్ష వీక్షణ భాగ్యానికై రామిగాడిరూములో తపస్సు చేస్తున్నానో....ఆ సుందరీమణి హాతోస్మి! సూరిగాడు చెప్పే 'సైకో ఎనాలసిస్' సిద్ధాంతంప్రకారం చూస్తే ఆమె ప్రవర్తన కొంత ఆశాజనకంగావుంది నవ్వొచ్చింది. నవ్వులో ఆనందం. ఆ ఆనందంలో ఎగిరి గంతేసి తలుపుతీశాను. ఎదురుగా ఎదురింటి చిన్నపిల్ల కిటికీలోగుండా నానవ్వు—కుప్పిగంతులు చూస్తూవుంది కామోను, చెక్కిటచెయిచేర్చి సాలోచనగా ఒక కన్ను మూసి నావేపు చూస్తుంది. ఆ పిల్లను అట్లా ఆ భంగిమలో చూస్తుంటే మొదట ఆశ్చర్యమువేసి ఫక్కున నవ్వాను. ఆ పిల్ల పెద్ద నాపసానిలా సిగ్గుపడుతూ కళ్ళకు చెయ్యి అడ్డుపెట్టుకొని దొంగ చూపులు చూస్తుంది. ఆ పాపను చూస్తుంటే ముద్దొస్తుంది. ఒక్కసారి పరుగెత్తి రెండుచేతుల్లో ఎత్తి ఎగరవేసి ఫక్కుమని నవ్వేలా చేయాలనిపిస్తుంది.

'పాపా! ఇలారా!' అన్నాను.

ఊహు!

రా! పాపా!

'నేను రాను' అంటూ నవ్వుతుంది.

'కొంచెంరద్దూ?' జాలి న భిన యిస్తూ నవ్వుతూ అన్నాను.

'నేను రానంటే' కోపం అభినయిస్తూ క్రింద పెదవిని కొరుకుతూ కళ్ళుపెద్దవి చేస్తూ అంది.


'రమ్మంటే!'

'రానంటే!'

ఇద్దరం ఒక్కసారి ఫక్కుమని నవ్వాం. మా నవ్వులు దూరముగా పోతున్నకొద్దీ కిలాకిలామని నవ్వు నా చెవులకు శ్రావ్యముగా సంగీతంలా విన్పించింది. తలెత్తి చూశాను. ఎదురింటి అమ్మాయి నల్లపిల్ల వారడేసికళ్ళతో ముత్యాల్లాంటి పళ్ళతో తల దువ్వుకుంటూ ఎదురుగా ప్రత్యక్షం.

ఆలోచనలనుంచి ఈమెగారు ఎక్కడేవుంది కామోను. చచ్చేంత సిగ్గయింది. సిగ్గుతో నవ్వు పొర్లింది. నవ్వాపుకోలేక నవ్వుతూ తలుపులువేసి మంచం మీద వాలాను. అత్తా! అత్తా! అంటూ నా స్నేహితురాలు 'పాప....పరుగెత్తటం విన్పించింది.

మరల హుషారుగా వరండాలోకి వచ్చి కిటికీ తెరచి ఎదురింటివైపు చూశాను. ఛ! ఛ! నల్లపిల్లలేదు సరికదా! గండుపిల్లి మొఖంవేసుకొని మాకిటికీవైపే ఎవడో బట్ట



తలవాడు ఆ అమ్మాయి మొగుడు కామాలు చూస్తున్నాడు. నాకు కళ్లు జెర్రులు పాకాడినట్లయింది. వాడి మొఖం వాడూనూ. వాడి సొమ్మేమో నేను తిన్నట్లు నాలుగైదు రోజులనుంచి ఇదే వరస కొరకొరా చూస్తాడెందుకో? కిటికీతలుపులు దభాలునవేసి ముఖం కడుక్కుంటున్నాను. ఎదురింట్లో ఏవో తిట్లు నాలుగయిదు దెబ్బలుకొట్టిన చప్పుళ్ళు. గుడ్డలువేసుకొని తలుపు తీసి కిట్టిగాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నా.

ఎదురింటివైపు చూశాను. నే నెప్పుడు అటు చూస్తానా అన్నట్లు ఆ గండుపిల్లి మొఖం ఆ బట్టతల ఏదో అదుర్దాగా మాట్లాడింది. తల వంచుకొని ఏదో పుస్తకం తీశాను.

"ఏయ్! మిష్టర్! మిమ్మల్నే!"

గండుపిల్లిమొఖం నన్ను పిలుస్తుంది.

"ఏమండీ! మిమ్మల్నే! ఎందుకు నవ్వుతున్నారు?"

బట్టతల ఊగుతూ నన్ను ప్రశ్నిస్తోంది.

అసహ్యాన్ని, ఆశ్చర్యాన్ని బలంగా అణగద్రొక్కి "నన్నా" అన్నాను.

"మిమ్మల్నే! ఎందుకు నవ్వుతున్నారు?"

గండుపిల్లిమొఖం ఎర్రబడింది. బండ పెదవులు అదరుతున్నాయ్.

అప్పుడు అర్థమయింది. కొంప మునిగింది. ఏదో అభియోగంతేబడిందికామాలు భగవంతుడా! ఏమిటీ పరీక్ష. నా సుందరి కాంతాదేవి ప్లీడర్ కూతురు వింటూవుందేమోనే! హా! హత విధీ!

గండుపిల్లి మొఖం పరీక్షగా చూశాను. నావైపు కొరకొరచూస్తూ ప్రశ్నిస్తున్నట్లు సొసలుపైకెత్తి బుసకొడుతుంది గడపలో నుంచొని ఆ వెనుక విచారంగా నల్లపిల్ల ఆమె అమ్మ నా స్నేహితురాలు పాప అమాయంగా.

"మిమ్మల్నేనండి? ఎందుకట్లా నవ్వుతున్నారు" బట్టతలవాడిగొంతులో అవమానం ధ్వనిస్తుంది.

అనుకోకుండానే వాకిట్లోకి వెళ్ళాను.

"ఏమిటి? ఎవరు? ఎందుకు? ఎప్పుడు?" ప్రశ్నలపరంపర పరుగెత్తింది నా నోటి నుంచి.

బట్టతలవాడు తటపటాయించాడు.

"మీరే నవ్వారు! ఎందుకు నవ్వారు? అన్నాడు తెచ్చిపెట్టుకున్న భీకరత్వం కన్పడుతూనేవుంది. పెళ్ళాం, అత్త తనను ' అప్రయోజకుడు ' అనుకుంటున్నారేమో ననే అనుమానం మొఖంమీద ముద్ర వేసింది.

జారుతున్న పైరాక్టిని కూడగట్టుకున్నాను. కోపముతో ఒక్కసారి వళ్లంతా వణికింది. ద్వారబంధాన్ని గట్టిగా పట్టుకొని—

"ఎవర్నిచూసి నవ్వాను?" అన్నాను. నా గొంతు నాకే ఆశ్చర్యాన్ని కలుగజేసింది. నా అరుపుకు ప్రక్కసందులోకి పోయేవాళ్ళు ఒకసారి వెనక్కితిరిగి చూసి వాళ్ళదారినవాళ్ళుపోయారు. నాకే సిగ్గనిపించింది. ఈ భ్రాష్టుడు నా పరువు కాస్తా కాంతాదేవి వింటుంది కాబోలు.

బట్టతల తికమకపడింది. తికమక తల ఊపులో కనపడింది.

"మీరు నవ్వుతున్నారు మా అడాళ్ళను చూచి" అన్నాడు.

నాకు కోపం యెక్కువవుతుంది. కాళ్ళు చేతులు గడగడవణుకుతున్నాయి. కళ్లలో మంటలు మండుతున్నట్టయింది. ఎంత ప్రయత్నించినా మాటలు రావటంలేదు. పెదవులదరుతున్నాయి. 'ఏంచేస్తానో' అని భయంవేసింది. తమాయించుకొని—

"మిష్టర్! కొంచెము మాటలు జాగర్తగా రానియ్! మీ అడాళ్ళనుచూచి నేను నవ్వలేదు. అపాపను చూచే నవ్వింది నేను.... ఆ పాప నన్నుచూసి నవ్వుతుంటే నేను నవ్వుతున్నాను. పిచ్చిపిచ్చిగా మీయిష్టం వచ్చినట్లుగా మాట్లాడితే జాగర్త! అన్నాను తడబడుతూ. బట్టతల గండుపిల్లి మొఖం కుంచించుకపోయింది. అయినా—

"అట్లా అడాళ్ళనుచూసి నవ్వటం బాగాలేదు. మీ ప్రవర్తన నాకేం నచ్చలేదు. మీకు అక్కా....చెల్లె....

"మిస్టర్! మీకొకసారిచెప్పాను. అమెను చూసి నవ్వలేదని....అమెపట్ల ఇంతవరకు నాకే దురభిప్రాయమూ లేదు. అనవసరముగా మాట్లాడితే తర్వాత మీరే బాధపడాల్సివస్తుంది" అన్నాను అతనిమాటల్ని మింగుతూ తీక్షణంగా.

వాళ్ళత్త "ఏదో జరిగిందిలేయ్యా! ఇంక రావయ్యా! లోపలికి!" నముదాయిస్తూ లోపలికి తీసుకెళ్తుంది. నల్లపిల్ల వెనక్కు మళ్ళింది. నల్లపిల్లవెనక గొణుక్కుంటూ గండుపిల్లిమొఖం. తలుపులు మూసుకున్నాయి.

తల దిమ్ముగా వుంది. ఈ రోజు లేచి ఎవడిమొహం చూచానో ఏమో? ఇదో దరిద్రపుగొడవ. ప్లీడర్‌గారమ్మాయి ఆ కాంతాదేవి ఆ ముగ్ధమోహనసుందరీ సుందర వదనకటాక్ష వీక్షణాలకై ఈ రామిగాడి ముదనష్టపుకొంపలో నేను అపసోపాలు పడుతుండటమేమిటో! ఈ ఏడుపుగొట్టు ఏబ్రాసిమొఖంగాడితో లేనిపోని నిందలు నిష్టూరాలు వళ్లుమండిపోతుంది. ఇంట్లోకి పిలచి ఆ చెంపా ఈ చెంపా వాయించి పంపాలనిపిస్తుంది. ఎదురింటి తలుపు దబదబామంటుంది. నల్లగా కోతిమొఖం వేసుకొని, సర్కస్‌లో బఫూన్‌లా గళ్ళ పైజమా, చార్లబనియన్‌వేసుకొని తలుపు మీద గుద్దుతున్నాడు. నల్లపిల్ల తమ్ముడు గామాలు. గండుపిల్లి మొఖం, బట్టతల వాడిబావమరది.

"మిష్టర్! ఇట్లా రావయ్యా!" అని అధికారపూర్వకంగా పిలచాను.

ఒక్కక్షణం తటపటాయించి తననే పిలుస్తున్నానని నిర్ధారణ చేసికొని మా యింటిగడపలోకి వచ్చి ఏమిటీ? అన్న ప్రశ్నార్థకమొఖంవేసి నుంచున్నాడు.

నానోటినుండి దురుసుగాగంగాప్రవాహతుల్యవాగ్ధోరణిలా విషయం కాస్తా ఊరికింది. ఉపసంహారంమాత్రం చాలా కటువుగా వుంది.

"మిస్టర్! మిమ్మల్నందర్నీ చూసి వూరుకుంటున్నాను. మీతో నాకు పెద్దపరిచయము లేకపోయినా రోజూ మిమ్మల్ని చూస్తూ వుండటంవల్ల అతన్ని ఈసారికి వదలిపెడుతున్నాను. జాగ్రత్త! పోయి చెప్పు! అని ముగిసింది నా వాక్ప్రవాహం పాపం. కళ్లలోకి వక్కసారిచూచి ఏమనుకున్నాడో ఏమో మెదలకుండా జారుకున్నాడు.

గుండెలోకి గుప్పెడు రిలీఫ్ వచ్చినట్లయింది. ఫరవాలేదు ఏదో ఒక రకంగా వ్యవహారం పరిష్కారానికి వచ్చింది. అయినా పీడి గండుపిల్లిమొఖం పాడుగాను. ఇదేం వరస ఒకవేళ నాకేదైనా దురభిప్రాయముందే అనుకుందాం....ఐనా వాడ్ని ఎదురుగా ఉంచుకునేనా .... అటూ ఇటూ చూడకుండా ఆమెతో నవ్వుతూ నవ్వులపాలవుతాసా? ఏదైనా అనుమానం ఉంటే నా దగ్గరకువచ్చి అడగ్గూడదూ? బజార్లో నుంచొని ఏమిటో ఆ రంకెలు? ఏది ఏమైనా నాదే పైచెయ్యిలాగుంది. ఏం మనుషులో ఏమో! మరీ ఇంత అనుమానం అయితే బ్రతుకంతా బండబారి ఏడవాల్సిందేగా దరిద్రుడు!

ఎదురింటితలుపు కర్‌మంది. బట్టతల గండుపిల్లిమొఖం బాగా టాయ్‌లెట్ అయి బజారుకి వెళ్తుంది. ఎందుకో నాకు హుషారైంది.

"ఏమండీ!" అని పిలిచాను.

గండుపిల్లిమొఖంకళ్ళు అనుమానంగా ఆశ్చర్యంగా చూశాయి. "మిమ్మల్నేనండి! ఇలారండి" అని గబగబా లోపలకుపోయి కూర్చున్నాను. గడపవద్ద క్షణం తటపటాయించి లోపలకు వచ్చాడు.

"కూర్చోండి!" అంటూ కుర్చీ ముందుకు తోసాను. కుర్చీమీద గండుపిల్లిమొఖం....

"ఏమండీ మీపేరు....నా ప్రశ్న.

"నాగులండీ" జవాబు.

నల్లపిల్లమొగుడు నాగులన్న మాట. బాగుంది. బావమరదికి చెప్పిన విషయమే బావకు చెప్పాను.

"ఏదో జరిగిపోయింది లెండి? మీకే దురుద్దేశ్యము లేదన్నారుగా?" నా కళ్ళలో 'దురుద్దేశ్యం'కోసంగామాలు అనుమానంగా పరిశీలనగా వెదకుతున్నాడు నాగులు.

"మీకిదివరకే చెప్పాను. ఐనా మీరు చేసినపని ఏమీ బాగాలేదు. మీ పరువు మీరు పోగొట్టుకున్నారు నా పరువుతీశారు" అన్నాను.

కాసేపు మౌనం.

"మీపేరు?" అన్నాడు చెప్పాను.

"అది సరేననుకోండి" ఏదోచెప్పబోతూ ఆగాడు. చెప్పమన్నట్టు చూశాను.

"మీరంటే....మీరు కాదనుకోండి? ఈ కాలపుకుర్రాళ్ళు స్టూడెంట్సు మరీ మిడిమేలంగా మీ ప్రక్కింటి ప్లీడరుగా రమ్మాయిని చూశారూ?"

"చూడకేం? చూశా!" నోరుజారి నాలిక్కరుచుకున్నాను.

"ఆ అమ్మాయి చాలా మంచిదండీ! ఏం వుట్టుందో ఏమో ఆ యింటికి సరిగా వచ్చే వరికి, పెద్దమొనగాళ్లలా పోజుపెట్తారండీ! అసహనంగా నాగులు గొంతు మూలుగుతుంది" అయినా ఆ అమ్మాయి లెక్క చెయ్యదులెండి! కన్నెత్తికూడా చూడదులే" అని సమాధానపరచుకుంటున్నాడు.

"ఓరి వీడిదుంపతెగా! ఇదా వీడి కడుపుమంట. ఏమో ఆ అమ్మాయిని బజార్నపోయే వాళ్లెవరో చూస్తె వీడిసొమ్మేమిపోయిందో? ఆ అమ్మాయిమాత్రము ఎన్నిసార్లు బజార్నపోయేవాళ్లవంక చూడ్డంలా.

"ఆ అమ్మాయి బజార్నపోయేవాళ్ళవైపు ఎందుకు చూడాలేం? ప్రశ్న గొంతుదాకా వచ్చి గమ్మునూర్కుంది. ఆ అమ్మాయి వాళ్ళనుచూస్తే, వాళ్ళు ఆ అమ్మాయివంక చూస్తేమాత్రము తప్పేమిటో? నాకేం బోధపడలేదు.

మీమీద నాకేం అనుమానం లేదండి! మీదగ్గరికి ఎంతోమంది ఆడపిల్లలు వస్తుంటారుగా చదువుకోటానికి, అలాంటి వాళ్ళయితే ఎలాలేండి? అన్నాడు నాగులు.

"అప్పటికి ఒకటి రెండు సార్లు చెప్పానండీ! అయినా నన్ను చూసే నవ్వుతున్నాడని ఆఅమ్మాయి, మాఆవిడ చెప్పిందండీ" అన్నాడు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఆ అమ్మాయి అలా ఎందుకు చెప్పిందబ్బా? ఏమో ?

"ఆమే అపార్ధంచేసికొని ఉండవచ్చులేండి" అని ఆ మాటా యీమాటా చెప్పి విశ్రమించాడు నాగులు. బద్ధంకగా మంచముమీద వాలాను. పరుపుపై మత్తెక్కిస్తూ వాడినమల్లెపూలు ఇంకా నయము. ఈ గోలంతా సరోజ వెళ్ళింతర్వాత జరిగింది. ఆమెవుంటే ఏమనుకునేదో? రాత్రి వచ్చి తెల్లవారి 10 గం॥ బండికే వెళ్లింది కాబట్టి సరిపోయె.

రాత్రి సరోజవచ్చినపుడు నల్లపిల్ల చారడేసికళ్ళతో ఆశ్చర్యంగా చూట్టం ఆమె వెనుక గండుపిల్లి మొఖం ఆ దృశ్యము గుర్తొచ్చింది. సరోజరాకకు యీ తగాదాకు ఏమైనాసంబంధముందేమో? వాళ్లదృష్టిలో నేను చుల్కనైపోలేదుకదా! "మీదగ్గరకు ఎంతోమంది ఆడపిల్లలు వస్తుంటారుగా" వ్యసనంతో అన్న నాగులుమాట గుర్తొచ్చి నవ్వుకున్నాను.

ఆ సాయంత్రము కిట్టిగాడితో జరిగిందంతా చెప్పాను. కాంతాదేవి విన్నదేమోననే విచారము వెలిబుచ్చాను. "ఫరవాలేదని" భరోసాగా మాట్లాడాడు.

నాలుగైదు రోజులు కాలప్రవాహంలో కరగిపోయాయి. ఆరోజురాత్రి ఏదో పుస్తకము చదువుకుంటూ పండుకున్నాను. మొదటి సినిమానుండి వచ్చే జనంసందడి విన్పడుతుంది. ప్రక్క యిళ్ళవాళ్ళెవరో రెండో సినిమాకు పోవటానికి ఒకర్నొకరు తొందరిస్తూ పిల్చుకుంటున్నారు. అరగంట అయింతర్వాత బయట తలుపుమీద ఎవరో తట్టినచప్పుడువిన్పడింది. నాకోసం ఇప్పుడెవరొస్తారా అని ఆలోచిస్తూ పుస్తకం మూసి పడుకున్నాను.

కాసేపు నిశ్శబ్దము.

ఎక్కడో కుక్క "భౌ భౌ" మంటుంది.

తలుపుపై చప్పుడు.

గాజుల గలగల శబ్దము.

"ఏమండీ!" అన్న ఓ కోమలి కంఠధ్వని. తలుపుగడితీశాను. ఎదురుగా ఎదురింటి నల్లపిల్ల చారడేసికళ్ళతో మత్తెక్కించే మల్లెపూలవాసనలతో చిరునవ్వుతో క్షణం తటపటాయించి లోపలకు వచ్చి తలుపుగడివేసింది. నాకు ఆశ్చర్యమేసినది. ముచ్చెమటలుపోస్తున్నాయి. మళ్ళా ఏం ముంచుకొస్తుందో ?

ఏ....మి....టండీ ? సత్తినత్తిగా నేను నవ్వుతూ....పడకగదివేపు వెళ్తుంది. తెల్ల పరుపుపై నల్లపిల్ల చిరునవ్వుతో వయ్యారంగా పుస్తకంవైపు పరధ్యానంగా చూస్తూ ఆశ్చర్యంతో....నిశ్చలంగా....గడప దగ్గర నేను.

పుస్తకంమూసి గాజుల గలగలతో వొళ్లు విరుచుకుంటూ....నవ్వుతూ .... మంచంపై నల్లపిల్ల....

తొలికోడికూత....నల్లపిల్ల నవ్వుతూ....

మా ఇంటి తలుపు గడితీసిన చప్పుడు కాసేపు నిశ్శబ్దం ఎదురింటితలుపు గడివేస్తున్న శబ్దము,

"చల్లగుండాలీ పిల్లా
నల్లగుంటే దోసమే"

నాలో ఎక్కడో పాట కూనిరాగం తీస్తుంది. ★

# రాజుగాడి పెళ్లి

★

రచన:

పియ్యాద్రి గురుమూర్తి

ఒరేయి రాజూ! ఎప్పటిలాగునే వాడి యింటికివెళ్లి పిలిచాను. "లేడండి" అని వాడి చెల్లెలు సమాధానం. వెధవ ఎప్పుడూ యింట్లో వుండడు కదా అని మనస్సులో అనుకొని ఎక్కడి కెళ్లాడు! అని మళ్లీ అడిగాను. రాణిగారిని చూడటానికి అంది. ఈమాట వినడముతో నాకెంతో ఆనందమనిపించింది.

ఎందుచేతనంటారా వాడి సమవయస్కులయిన మా కందఱకూ పెళ్ళిళ్ళు అయి కొందఱిమి పిల్లల తండ్రులమైనా వాడికిదివఱకు పెళ్ళే కాలేదు. ఇప్పటికి ఏదో ఒక యింటివాడవుతున్నాడంటే ఎంత సంతోషించాననుకున్నారు. కాబోయే వదినెగారితో అప్పుడే పరాచికాలు ఆడుతుంది వాడి చెల్లెలు అనుకున్నాను. మరునాడు మా రాజు కనుపించగానే అడిగాను కాబోయే మామగారిది ఏ వూరురా? అని. ఏమోరా అదెప్పటి మాటో అన్నాడు. అదేమిట్రా అలా అంటావు నిన్ననేగా పెళ్ళిచూపులకు వెళ్ళినట్లు మీచెల్లెలు చెప్పింది అన్నాను. పెళ్ళిచూపులకా అంటూ విస్తుపోయాడు వాడు. నిన్నను మీ యింటికి వచ్చి నిన్ను పిలవగానే రాణిగారిని చూడటానికి వెళ్ళాడంటూ మీచెల్లెలు చెప్పినది. వదినెగారితో అప్పుడే పరాచికాలు ఆడుతుంది అని ఎంతో మురిసిపోయాను. మరి ఏమిటికథ అన్నాను. ఓరి దద్దమ్మా అదికాదురా హిందూదేశ పర్యటనకు మహారాణి ఎలిజబెత్ రాలేదటరా ఆమె యిప్పుడు కలకత్తాలో ఉందిరా ఆమెను చూడటానికని వెళ్లాను అన్నాడు. వీడికి పెళ్లిగీత లేదేమో మరి.

★